గ్రీవెన్స్‌కు 65 దరఖాస్తులు

- మానవతా దృక్పథంతో సమస్యలు పరిష్కరించాలి
- కోర్టు కేసుల పరిష్కారానికి కృషి చేయాలి
- అధికారులకు కలెక్టర్ ప్రావీణ్య సూచన

దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఖిలావరంగల్, డిసెంబర్ 18: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో 65 మంది వివిధ సమస్యలపై కలెక్టర్ పీ ప్రావీణ్యకు దరఖాస్తులు అందించారు. ఎక్కువగా భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన వినతులను మానవతా దృక్పథంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కరించలేని దరఖాస్తుల వివరాలను బాధితులకు రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఒకే సమస్యపై దరఖాస్తుదారుడు పలుమార్లు గ్రీవెన్స్‌కు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు వాసుచంద్ర, కృష్ణవేణి, జీడీపీ సీఈవో రాంరెడ్డి, డీఆర్డీవో సంపత్‌రావు పాల్గొన్నారు.

మొక్క నాటిన వనప్రేమికుడు

నెక్కొండ, డిసెంబర్ 18: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మ్యారేజ్ డేను పురస్కరించుకొని వనప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య గుండ్రపల్లిలోని చెరువుకట్టపై ఉన్న మైసమ్మగుడి వద్ద సోమవారం నేరేడు మొక్క నాటారు. అనంతరం కేటీఆర్ దంపతులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

కేయూలో ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

హనుమకొండచౌరస్తా, డిసెంబర్ 18: కేయూ ఫార్మసీ కాలేజీ జాతీయ సేవా పథకం వలంటీర్ల శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశలో సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్, డీన్ వై నరసింహారెడ్డి, వై వెంకయ్య, జీ సమ్మయ్య, జే కృష్ణవేణి, స్వరూపారాణి, ప్రోగ్రాం ఆఫీసర్లు శశిధర్, సుజాత, సునీత, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పరకాల, డిసెంబర్ 18: ద్విచక్ర వాహనం పైనుంచి పడి యువకుడు మృతి చెందిన ఘటన నాగారంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కంచె కృష్ణ(25) ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బైక్‌పై పరకాలకు వచ్చాడు. పనులు ముగించుకొని తిరిగి అర్ధరాత్రి సమయంలో నాగారం గ్రామానికి వెళ్తుండగా పట్టణ శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయాడు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి కృష్ణ తండ్రి రవీందర్‌కు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని కృష్ణను పరకాలలోని దవాఖానకు తరలించారు. అతడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

నర్సంపేటరూరల్: తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన నర్సంపేట పట్టణంలోని పాకాల రోడ్‌లో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని పాకాలరోడ్‌కు చెందిన తాళ్ల చంద్రశేఖర్(53) ములుగు జిల్లా జంగాలపల్లిలోని రైస్ మిల్లులో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 6న మిల్లులో పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తుండగా ఇటుకాలపల్లి శివారులోని హైవేపై ఆరబోసిన ధాన్యం రాశులను తప్పించే క్రమంలో అదుపుతప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను సిద్దిపేటలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ చంద్రశేఖర్ మృతి చెందాడు. అతడి సోదరుడు తాళ్ల చిన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శీలం రవి తెలిపారు.

కేయూకు మరో కీర్తికిరీటం

- ప్రపంచంలోనే 600వ అత్యంత స్థిరమైన విశ్వవిద్యాలయంగా ర్యాంకు
- దేశంలో 29వ స్థానం, రాష్ట్రంలో మొదటి స్థానం
- కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు వెల్లడి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 18: కేయూ కీర్తికిరీటంలో మరో మణిహారం చేరింది. '2023 యూఐ గ్రీన్ మెట్రిక్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్'లో తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. యూఐ గ్రీన్ మెట్రిక్‌లో ప్రపంచస్థాయి యూనివర్సిటీల్లో కేయూ 600వ స్థానం, దేశంలోని విశ్వవిద్యాలయాల్లో 29వ స్థానం, తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో మొదటి స్థానం, తెలుగు రాష్ట్రాల విశ్వవిద్యాలయాల్లో 2వ స్థానంలో నిలిచి సత్తా చాటింది. దీనికి సంబంధించిన సర్టిఫికెట్ యూఐ గ్రీన్ మెట్రిక్ చైర్‌పర్సన్ నుంచి మెయిల్‌లో అందినట్లు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ ప్రపంచస్థాయి 600వ అత్యంత స్థిరమైన విశ్వవిద్యాలయంగా ర్యాంకు పొందిందని, పర్యావరణ సుస్థిరత, బాధ్యతాయుతమైన క్యాంపస్ నిర్వహణపై విశ్వవిద్యాలయం దృష్టి సారించిన ప్రయత్నాలకు ఇది నిదర్శనమన్నారు. జాతీయంగా విశ్వవిద్యాలయం దేశంలో 29వ స్థానంలో ఉందని, దేశంలో హరిత కార్యక్రమాలు, స్థిరమైన అభ్యాసాలను ప్రోత్సహించడంలో ముందున్నట్లు గ్రీన్‌మెట్రిక్‌లో విశ్వవిద్యాలయం ర్యాంకింగ్, వివిధ కోణాల్లో దాని స్థిరత్వ పద్ధతుల సమగ్ర అంచనాపై ఆధారపడి ఉంటుందని, ఈ రంగాలకు కేయూ నిబద్ధతతో ఉన్నత ర్యాంకింగ్‌లో ఉందని, వివిధ అంశాలు.. ముఖ్యంగా మౌలిక వసతులు, పర్యావరణం, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, బోధన, పరిశోధన, అవస్థాపన సౌకర్యాలు, రవాణా వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ర్యాంకింగ్ ఎంపిక ఉంటుందన్నారు. వీసీ తాటికొండ రమేశ్ ఈ సందర్భంగా బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులను అభినందించారు. ఇటీవల న్యాక్-ఏ ప్లస్ గ్రేడ్ సాధించిన విషయాన్ని గుర్తు చేశారు.

23న కేయూలో సదస్సు

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ రమేశ్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 18: కేయూ భౌతికశాస్త్ర విభాగం, ఇండియన్ అసోసియేషన్ ఫర్ రేడియేషన్ ప్రొటెక్షన్ సంయుక్తంగా ఈ నెల 23న 'బెనిఫిషియల్ ఎఫెక్ట్స్ ఆఫ్ రేడియేషన్ టెక్నాలజీ అండ్ ఇండియన్ న్యూక్లియర్ ఎనర్జీ ప్రోగ్రాం' అంశంపై ఒకరోజు సదస్సు నిర్వహించనున్నట్లు, కార్యశాల కన్వీనర్ డాక్టర్ జీ మంజుల తెలిపారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు తమ పేర్లను 20లోగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ మేరకు సోమవారం వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ శ్రీనివాసరావుతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి సీజే శ్రీలత, పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు జీ మంజుల, ఈవీరావు, నరసింహులు పాల్గొన్నారు.

శివనగర్‌లో చోరీ

ఖిలావరంగల్, డిసెంబర్ 18: చోరీ జరిగిన ఘటన సోమవారం శివనగర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మిల్స్‌కాలనీ పోలీసుల కథనం ప్రకారం.. శివనగర్ గణపతినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ చేతి దిలీప్ ఈ నెల 14న కొత్తపల్లి గ్రామంలో తన తాత అంత్యక్రియల కోసం వెళ్లి అక్కడే ఉన్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న ఐదున్నర తులాల బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆశాలపల్లిలో దుప్పట్ల పంపిణీ

సంగెం, డిసెంబర్ 18: ఆశాలపల్లిలో సోమవారం గడపగడపకూ దుప్పట్లు పంపిణీ చేశారు. పిట్టల సదయ్య గ్రామంలోని 525 కుటుంబాలకు ఇంటింటికీ వెళ్లి దుప్పట్లు అందజేశారు. పుట్టిన ఊరుపై ఉన్న మమకారంతో ప్రతి కుటుంబానికీ దుప్పట్లు ఇచ్చినట్లు తెలిపారు.

మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

మంత్రి సురేఖను కలిసిన నాయకులు

సంగెం, డిసెంబర్ 18: మండలంలోని కాంగ్రెస్ నాయకులు సోమవారం రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, సర్పంచ్ ఇండ్ల రవికుమార్, ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, నాయకులు జనగాం రమేశ్, మెట్టుపెల్లి రమేశ్, శ్రీకర్, ఆగపాటి రాజు, మడత కేశవులు, అచ్చ నాగరాజు, నర్సింహనాయక్, రాజు, సాంబయ్య, బోగి రవి పాల్గొన్నారు.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న గోపీచంద్

సనాతన సంప్రదాయంతో ముడిపడిన కళలు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 18: దేశ ఔన్నత్యం, ప్రాచీన కళలు, సనాతన సంప్రదాయంతో ముడిపడి ఉన్నాయని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ అన్నారు. సద్గురు శివానందమూర్తి జయంతి కార్యక్రమాల్లో భాగంగా ములుగురోడ్డులోని సప్తధామంలో సోమవారం రాష్ట్రస్థాయి శాస్త్రీయ నృత్య పోటీలు నిర్వహించారు. శివానంద నృత్యమాల వ్యవస్థాపకుడు, జాతీయ పురస్కార గ్రహీత సుధీర్‌రావు పాల్గొన్నారు. ఈ పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 120 మంది కళాకారులు హాజరయ్యారు.

108 కలశాలతో అభిషేకం

కాశీబుగ్గ, డిసెంబర్ 18: కాశీబుగ్గలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మార్గశిర శుద్ధషష్ఠిని పురస్కరించుకొని సుబ్రమణ్యస్వామికి 108 కలశాలతో భక్తిశ్రద్ధలతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారులు గుండేటి రజనీకుమార్, పెద్దూరి శ్రీనివాస్, మార్త సందీప్, కల్యాణ్ మార్త, గుండేటి రాజేశ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వామివారికి 108 కళశాలతో అభిషేకం చేస్తున్న కార్పొరేటర్

సాగర్‌రెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సాగర్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే చల్లా పరామర్శ

సంగెం, డిసెంబర్ 18: మండలంలోని కాట్రపల్లి సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు పులుగు సాగర్‌రెడ్డి నానమ్మ ఆగమ్మ సోమవారం మృతి చెందింది. ఈ మేరకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గ్రామానికి చేరుకొని ఆగమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులరించారు. అనంతరం సాగర్‌రెడ్డిని పరామర్శించారు. అలాగే, ఇటీవల కెనాల్‌లో పడి మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ చింతిరెడ్డి తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, ఎనుమాముల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, మేరుగు వీరేశం ఉన్నారు.

వైభవంగా షష్ఠి బోనం

పరకాల, డిసెంబర్ 18: పట్టణంలోని భవానీ కుంకుమేశ్వరాలయంలో షష్ఠి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం షష్ఠి బోనాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశానుగత అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణశర్మ నివాసంలో బోనానికి శైవాగమ పండితుడు కోమాళ్లపల్లి సంపత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణ పురవీధుల్లో డప్పువాయిద్యాల మధ్య బోనాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. బోనాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రేమిడి మల్లారెడ్డి

కరీమాబాద్, డిసెంబర్ 18: తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు రేమిడి మల్లారెడ్డి హైదరాబాద్‌లో జరిగన రాష్ట్రస్థాయి సమావేశంలో ఎన్నికయ్యారు. సోమవారం ఆయనను కళాశాలలో అధ్యాపకులు సత్కరించారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s. Shriram Finance Limited, **NARSAMPET Branch**. I issue the following notice to general public. My client intends to grant loan to **RAMAGIRI RAJANI KUMARI, W/O. RAGHAVA CHARY** Resident of by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if any one have any claims changes. Mortgages. Sale Agreements Court Attachments. Court Disputes ect., shall be informed to the address mentioned below in writing within 04 Days days from the date of this notice. Otherwise, later objections not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

వరంగల్ జిల్లా రిజిస్ట్రార్, నర్సంపేట సబ్ రిజిస్ట్రారు గారి పరిధిలోని, జిల్లా పరిషత్: వరంగల్, మండల పరిషత్: నర్సంపేట, మునిసిపాలిటీ: నర్సంపేట, రెవిన్యూ గ్రామము: నర్సంపేట, నర్సంపేట మునిసిపాలిటీ/ రెవిన్యూ గ్రామపరిధిలోని, వార్డు నెం.2లో, ఇ.నెం. 2-283/1/ పడమర భాగం పార్ట్ and Assessment No. 1167005590 గల సిమెంటు రేకుల కప్పుతోనున్న ఇల్లు & దీనికి చెందిన ఖాళీస్థలముతో యుక్తంగా విస్తీర్ణం: 463 చ.గ.లు సరియగు 387.12 చ.మీ. ప్లింత్ ఏరియా: 588 చ.ఫీ. ఎ.సి.సి., సదరు ఆస్తి యొక్క చుట్టు హద్దులు: ఉత్తరం: ఎంపటి ఎల్లమ్మ గారి ఖాళీ స్థలము, దక్షిణం: నామాని రాజు & ధనుంజయ్ గారల ఇండ్ల మరియు బొప్పరాతి వేణుగోపాల్ గారి ఇల్లు & ఖాళీ స్థలము, తూర్పు: 365 వ నెంబర్ జాతీయ రహదారి, పడమర: శంకరభక్తుల రాఘవాచారి గారి ఇల్లు.

Sd/- **NALLELLA SURENDER, NALLELLA SUHAS**
ADVOCATES, H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HNK, Warangal. Cell: 9849365117

PUBLIC NOTICE

Under the instructions of my client M/s. Shriram Finance Limited, **NARSAMPET Branch**. I issue the following notice to general public. My client intends to grant loan to **K.BHARGHAVI, W/O. MADHU,** Resident of (V) Mallampally, (M) Duggondi, Dist. WGL. by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if any one have any claims changes. Mortgages. Sale Agreements Court Attachments. Court Disputes ect., shall be informed to the address mentioned below in writing within 04 Days days from the date of this notice. Otherwise, later objections not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

వరంగల్ జిల్లా రిజిస్ట్రారు, నర్సంపేట సబ్-రిజిస్ట్రారు గారి పరిధిలోని, జిల్లా పరిషత్: వరంగల్లు, మండల పరిషత్తు: నర్సంపేట, నగర పంచాయితీ: నర్సంపేట, నర్సంపేట రెవిన్యూ గ్రామంలో సర్వే నెం. 64/A & సర్వే నెం. 65/B/1 లో ఇంటి ప్లాటు, ప్లాటు నెం. 16 లో (పార్ట్) మింజాంలే తూర్పు దిక్కున ఇంటి ప్లాటు ఖాళీ స్థల విస్తీర్ణం: 110 చ.గ.లు సరియగు 92.00 చ.మీ. (జిట్టి ఆస్తి ఏ వార్డు బ్లాక్‌లో చేరలేదు). సదరు ఆస్తి యొక్క హద్దులు: ఉత్తరము: 30 ఫీట్ల ప్రపోజుడు రోడ్డు, దక్షిణము: గన్నోజు రవీంద్రాచారి గారి తరిభూమి, తూర్పు: ప్లాటు నెం. 17, పడమర: కొండపాక అపర్ణ గారి ప్లాట్ నెం. 16/ పార్ట్ (ఈ రోజు రిజిస్ట్రీ ఐనందున).

Sd/- **NALLELLA SURENDER, NALLELLA SUHAS**
ADVOCATES, H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HNK, Warangal. Cell: 9849365117